క్లుప్తంగా

సిగ్నల్స్ సమస్య పరిష్కరిస్తాం..

సాక్షి స్పందన

నడికూడ : మండల కేంద్రం లోని బీఎస్ఎన్ఎల్ టవర్‌కు విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు సిగ్నల్స్ లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. దీంతో ఆదివారం సాక్షి దినపత్రిక 'బాధిస్తున్న బీఎస్ఎన్ఎల్' అనే కథనం ప్రచురించింది. కాగా బీఎస్ఎన్ఎల్ వరంగల్ డీఈ శ్రీనివాస్‌బాబు స్పందించారు. టవర్‌కు కావాల్సిన నూతన బ్యాటరీలను ఆర్డర్ చేస్తున్నామని, త్వరలో సిగ్నల్ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



పరకాల : నడికూడ మండలం చర్లపల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ వద్ద రూ.1లక్ష4వేల విలువచేసే రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పరకాల సీఐ క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి గ్రామం నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో కానిస్టేబుల్ దయాకర్, రాజయ్యతో పాటు నోమేష్ కలిసి వాహనాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. దీంతో వాహనంలో రేషన్ బియ్యం లభించినట్లు తెలిపారు. చర్లపల్లి గ్రామానికి చెందిన తూర్పాటి శ్రీధర్, తూర్పాటి అయిలయ్య పేదల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి బొలెరో వాహనంలో మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శివకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

రేపు వారసంత, వాటర్ ప్లాంట్ నిర్వహణకు వేలం

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో ప్రతి బుధవారం నిర్వహించే కూరగాయల వార సంత (అంగడి) నిర్వహణతో పాటు గ్రామంలో వాటర్ ప్లాంట్ నిర్వహణకు 2025–26 సంవత్సరానికి గాను ఈనెల 18వ తేదీన బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి ప్లవన్ మజుందార్, పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ వేలంలో పాల్గొనేవారు ముందుగా వేర్వేరుగా రూ.10 వేల చొప్పున డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. బాధ్యతలు దక్కించుకున్న వారు గ్రామపంచాయతీ షరతులకు లోబడి నిర్వహించాల్సి ఉంటుందని, తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని పెంచికలపేటలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బొంతల సాయికుమార్ (28) శనివారం రాత్రి కేశవాపూర్ నుంచి పెంచికలపేటకు బైక్‌పై దుకాణానికి వెళ్లి తిరిగి కేశవాపూర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం దామెర క్రాస్‌రోడ్ సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కానీ సాయికుమార్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు క్రాంతికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ సంతోశ్ తెలిపారు.

వీధి కుక్కలకు చర్మ వ్యాధులు



వేలేరు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వీధి కుక్కలు చర్మ వ్యాధుల బారిన పడుతున్నాయి. ఈ వ్యాధి సోకిన కుక్కలు మనుషులను కరిస్తే వారికి వ్యాధి సోకే ప్రమాదముందని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను ఇతర ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

వేదరత్న బిరుదు ప్రదానం

హన్మకొండ అర్బన్: సర్ సీవీ.రామన్ అకాడమీ (సేవా సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో హరిహర కళాభవన్‌లో ఆదివారం నిర్వహించి ఉగాది పురస్కారాల మహోత్సవంలో భాగంగా రాష్ట్రంలోని వివిధ రంగాల్లో నిష్ణాతులైన పలువురిని అకాడమీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అందులో భాగంగా నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షి దేవాలయ వేద పండితుడు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని సేవను గుర్తించి ఆయనను సువర్ణ ఘంటా కంకణం, వేదరత్న బిరుదుతో సత్కరించారు.

చెరువులు, కుంటలు వెలవెల

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వట్టిపోతున్న బోరుబావులు
- ఎండిపోతున్న పంటలు
- వేసవి ప్రారంభంలోనే నీటి ఎద్దడి
- పైపులైన్ ఉన్న చెరువులకైనా సాగునీరు వదలాలని రైతుల మొర



ఎండిపోయిన వరిని పశువుల మేత కోసం కోస్తున్న రైతు



నీళ్లు లేక పూర్తిగా ఎండిపోయిన పీచర జగంకుంట



పీచరలో ఎండిపోయిన గౌరవెల్లి ప్రధాన కాల్వ

వేలేరు : రోజురోజుకు ఎండలు తీవ్రతరం కావడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. మండలంలోని చెరువులు, కుంటలు నీరు లేక వెలవెలబోతున్నాయి. వ్యవసాయ బావులు, బోర్లల్లో నీరు తగ్గడంతో బోరుబావులను నమ్ముకుని వ్యవసాయం చేసిన రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతోంది. గత వర్షాకాలంలో వర్షాలు సాధారణం కంటే ఎక్కువే కురవడంతో అన్ని చెరువులు, కుంటలు మత్తడి పోశాయి. దీంతో రైతులు యాసంగిలో వరి, మొక్కజొన్న, తదితర పంటలను ఎక్కువగా సాగుచేశారు. కానీ నేడు చెరువుల్లో చుక్కనీరు లేని దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. గత పదిహేను రోజుల నుంచి భూగర్భ జలాలు పడిపోవడంతో కొన్ని బోర్లు ఎత్తేశాయని, దీంతో పంటలకు సరిపడా నీరు అందక ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మొదటగా గుండ్లసాగర్, సోదాషపల్లి, మల్లికుదుర్ల గ్రామాలకు సాగునీరు వదిలారు. రెండో విడతలో గుండ్లసాగర్ నుంచి పీచర సమ్మక్క ఆలయం వరకు రూ.9 కోట్ల 74 లక్షలతో పైపులైన్ పనులు ప్రారంభించి లోక్యాతండా, వేలేరు, తదితర గ్రామాలకు సాగునీరు అందేలా కృషి చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పైప్‌లైన్ ద్వారా సాగునీరు వస్తాయనే ఆశతో పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పైప్‌లైన్ ద్వారా ఆయా గ్రామాల్లోని చెరువులకు సాగునీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పైప్‌లైన్ ఉన్న గ్రామాల్లోని చెరువులకైనా సాగునీరు విడుదల చేయాలని ఆయా గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఎండిపోతున్న పంటలు

గత వర్షాకాలంలో వర్షాలు అధికంగా కురవడంతో యాసంగి పంటలకు ఇబ్బంది ఉండదని రైతులు ఎక్కువగా వరిసాగు చేశారు. మండల వ్యాప్తంగా యాసంగిలో 8,500 ఎకరాల్లో వరిసాగు చేయగా, 4 వేల ఎకరాల పైచిలుకు మొక్కజొన్న పంటలను సాగుచేశారు. పంటసాగు సమయంలో పుష్కలంగా నీరు పోసిన మోటర్లు ప్రస్తుతం ఎండలు ఎక్కువ అవుతుండటంతో భూగర్భ జలాలు ఒక్కసారిగా పడిపోయి పొలాలు ఎండిపోతున్నాయి. కొందరి రైతుల బోర్లు సగానికి పైగా తగ్గి నీళ్లుపోస్తుండగా మరికొందరివి పూర్తిగా ఎండిపోయాయి. దీంతో నీరులేక ఎండి పోతున్న పంటలను కాపాడుకునేందుకు మళ్లీ లక్షలాది రూపాయలు వెచ్చించి బోర్లు వేస్తున్నారు. కానీ నీరు పారకపోతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు తమ పొలాలు ఎండిపోకుండా కాపాడుకునేందుకు నీటి సౌకర్యం ఉన్న ఇతర రైతుల బోర్లకు డబ్బులిచ్చి నీళ్లు పారిస్తున్నారు. దీంతో రైతులు అప్పులపాలవుతున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

రెండున్నర ఎకరాల పొలం ఎండిపోయింది



నాకున్న రెండున్నర ఎకరాల్లో వరిసాగు చేశాను. వ్యవసాయ బావిలో నీళ్లు లేవు. రెండు సంవత్సరాల క్రితం వేసిన బోర్ నుంచి నీరు సన్నగా పారుతుండడంతో వరికి సరిపడా నీరు లేక పంట మొత్తం ఎండిపోతుంది. యాసంగి పెట్టుబడి ఖర్చు సుమారు 40 వేల పైనే అయ్యింది. ప్రస్తుతం పంట కంకి తొడిగే స్థాయికి వచ్చి ఎండిపోతుంది. పంట చేతికందే పరిస్థితి లేకపోవడంతో వరిని కోసి పశువులకు మేతగా వేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. పైపులైన్ సదుపాయం ఉన్న చెరువులకు సాగునీరు విడుదల చేయాలి.

- అంబీరు ప్రకాశ్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని మాందారిపేట, కొత్తగట్టు సింగారం, పెద్దకోడెపాక, జోగంపల్లి, మైలారం, శాయంపేట, పత్తిపాక, నేరేడుపల్లి, కాట్రపల్లి, వసంతాపూర్, గంగిరేణిగూడెం, కొప్పుల గ్రామాల్లో రూ. 7.74 కోట్ల నిధులతో సీసీరోడ్ల నిర్మాణం, బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ప్రజల ప్రతి అవసరాన్ని తీర్చేడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతిఒక్కరికీ అందుతున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంతో మహిళ సంఘాలకు బస్సులను అందజేసినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మందికి రూ.5.96లక్షల విలువచేసే సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందించారు. అనంతరం ప్రగతి సింగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పిట్టల రఘుపతి, బళ్ల సంతోశ్, చిలుకల తిరుపతి, సతీశ్, రవి, దైనంపల్లి ప్రకాశ్‌తో పాటు మరో 20మంది కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిచంద్ర, ఏఓ గంగాజమున, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలకు మతిభ్రమించింది



కమలాపూర్ : కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఆత్మకూరులో..

- కాంగ్రెస్ నాయకుల మండిపాటు
- కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ఫ్లెక్సీ దహనం

కమలాపూర్ : రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ నేతలకు మతిభ్రమించిందని ఏఎంసీ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీరాణి, హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేశ్‌గౌడ్ మండిపడ్డారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఏకవచనంతో సంబోధించి అవమానించారని నిరసిస్తూ టీపీసీసీ ఆదేశాల మేరకు కమలాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై నిరసన, ఆందోళన చేపట్టి బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. దళితులను చిన్నచూపు చూస్తున్న బీఆర్ఎస్ పార్టీని ప్రజలు తరిమి కొట్టాలన్నారు. దళిత ప్రజాప్రతినిధులను కించపరిచే విధంగా ఎమ్మెల్యేలను ప్రోత్సహిస్తున్న కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని, పార్టీ నుంచి సస్పెన్షన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ జనగాని శివకృష్ణగౌడ్, నాయకులు పుల్లూరి శ్రీనివాసరావు, బొల్లం రాజిరెడ్డి, రిక్కల నారాయణరెడ్డి, డాక్టర్ మాటం కుమారస్వామి, మాట్ల రమేశ్, పోడేటి భిక్షపతి, పెరుమాండ్ల పర్శరాములుగౌడ్, గూడెపు మొగిలయ్య, ఆడెపు శ్రీకాంత్, చేరాల రోహిత్, శనిగరపు రమేశ్, పుల్ల శోభన్, పుల్ల సునీల్, మాట్ల రాజేష్, వైనాల సుభాశ్, కల్యాణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి శాసన సభ స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు వాసు, కిరీటి, మాజీ జెడ్పీటీసీ రాధికరాజు, మాజీ సర్పంచ్ రాజు, సొసైటీ మాజీ చైర్మన్ రవీందర్‌గౌడ్, నాయకులు జయ్‌పాల్‌రెడ్డి, రవి, సందీప్, ప్రసాద్, రాజేందర్, కిరణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 2002–03 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అలనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. అనంతరం సంపక్తి భోజనం ఆరగించి గ్రూప్ ఫోటోలు దిగి ఎంజాయ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఆగయ్య, పాషా, సత్యనారాయణ, విద్యార్థులు సురేష్, రమేశ్, శ్రీనాథ్, సతీశ్, ప్రవీణ్, స్వప్న, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఆ వైద్యులపై చర్య తీసుకోవాలి



ఎంజీఎం / వరంగల్: నగరంలోని సీకేఎం ప్రసూతి ఆస్పత్రిలో ఈర్ల వెన్నెలకు వైద్యం చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వరంగల్ జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెన్నెలను ఆదివారం పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ నగరంలోని 14వ డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఈర్ల వెన్నెల ఈనెల 11న కాన్పు కోసం నగరంలోని సీకేఎం ప్రసూతి ఆస్పత్రిలో చేరగా మగబిడ్డకు జన్మనిచ్చిందని అన్నారు. వైద్యులు చిన్న ఆపరేషన్ చేసి కుట్లు వేసే సమయంలో శరీరం లోపల ప్యాడ్ ఉంచి ఇంటికి పంపించారని విమర్శించారు. దీంతో వెన్నెలకు తీవ్రంగా బ్లీడింగ్ కావడంతో పాటు యూరిన్, మోషన్ పూర్తిగా ఆగిపోయి తీవ్ర ఇబ్బంది పడి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిందన్నారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారని తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈర్ల వెన్నెలకు నిర్లక్ష్యంగా చికిత్స చేసిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధితురాలి ఆరోగ్యం మెరుగుపడే వరకు వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలని సూచించారు. ఈ విషయంపై కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి తక్షణమే స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని రత్నమాల కోరారు.

బ్రహ్మకుమారీల సేవలు స్ఫూర్తిదాయకం



దాదీ వర్ధంతిలో పాల్గొన్న బ్రహ్మకుమారిలు

పరకాల : సమాజంలో ప్రతి మనిషిని గౌరవిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు, మానసికోల్లాసానికి ప్రజాపిత బ్రహ్మకుమారీలు చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని పరకాల ప్రముఖ వైద్యుడు మంత్రి కాశయ్య అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం పరకాల బ్రాంచిలో రాజయోగిని హృదయ మోహిని దాదీ 4వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. దాదీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాబా సేవలో రాజయోగిని హృదయ మోహిని సేవలు మరువలేనివని కొనియాడారు. దాదీ చేసిన ప్రవచనాలు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పరకాల బ్రాంచి నిర్వాహకురాలు బ్రహ్మకుమారీ విజయలక్ష్మి, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

47వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్‌లోని భవానీనగర్, బాలాజీనగర్‌లలో అభివృద్ధి పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరిశీలించారు. విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందించి రూ.40 లక్షలు సీడీఎఫ్ నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు షేక్ అస్గర్, మైసారపు సిరిల్‌లారెన్స్ తెలిపారు. కార్యక్రమంలో సిలువేరు విజయభాస్కర్, ఇప్ప శ్రీకాంత్, బిలాల్, భూషపాక శ్రీనివాస్, బర్ల రాజ్‌కుమార్, మాతంగి స్వామి, బండారి రాజేందర్, కొమురవెల్లి రమేష్, ఒగ్గుల భద్రయ్య పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో గొంతు నొక్కలేరు



ధర్మసాగర్ : పోలీస్‌ల అదుపులో నాయకులు



వేలేరు : మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, బీఆర్ఎస్ నాయకులు

ధర్మసాగర్ : పోలీస్ వ్యవస్థను ఉపయోగించి అక్రమ అరెస్టులు చేసి ప్రశ్నించే గొంతును నొక్కలేరని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గ కేంద్రంలో ఆదివారం నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభ నేపథ్యంలో తమను పోలీస్‌లు వేకువజామునే అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎంను ప్రశ్నిస్తామని భయంతోనే తమను ముందస్తు అరెస్టు చేసినట్లు విమర్శించారు. అదే విధంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌లు బీఆర్ఎస్ పార్టీ నాయకులను కూడా అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గంగారపు శ్రీనివాస్, బొడ్డు శాంతిసాగర్, బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ కర్ర సోమిరెడ్డి, మునిగెల రాజు, లక్క శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి వెళ్లాయనే భయంతోనే కాంగ్రెస్ పార్టీ అక్రమ అరెస్టులు చేపిస్తుందని విమర్శించారు. సీఎంకు బీఆర్ఎస్ నాయకులు ఎక్కడ ప్రశ్నిస్తారోననే భయం పట్టుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.

ఎర్రగట్టు ఆలయాభివృద్ధికి కృషి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారిని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ టీటీడీ దేవాలయం నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయాభివృద్ధికి దాతలు కూడా ముందుకు రావాలని కోరారు. అలాగే, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, ధర్మకర్తలు శీలం రమేష్, కనపర్తి రాజు, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు పీసం సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, శివరాం, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి పాల్గొన్నారు.

‘మిషన్ భగీరథ’ నీటి సరఫరా నిలిపివేత



మిషన్ భగీరథ గ్రిడ్‌లో మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారులో గల మిషన్ భగీరథ (8 యంఎల్‌డీ–డబ్ల్యూ.టీ.పీ)లో మెయిన్ పైపులైన్ మరమ్మతుల కారణంగా మండలంలోని 22 గ్రామాలకు సోమవారం నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్ తెలిపారు. జోగంపల్లి, పెద్దకోడెపాక, గోవిందాపూర్, కొప్పుల గ్రామాల మినహా మిగతా 22 గ్రామాలకు నీటి సరఫరా ఉండదని తెలిపారు. మళ్లీ మంగళవారం సాయంత్రం నీరు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పైపుల డయాను పెంచుతున్నట్లు తెలిపారు.

పొట్టి శ్రీరాములు ఆశయాలు ఆదర్శం

వరంగల్ చౌరస్తా: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు అన్నారు. వరంగల్ చౌరస్తాలోని వైశ్య భవన్‌లో వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 124వ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రకాశ్‌రావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రం కోసం నిరవధిక నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించి అసువులు బాసిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. అనంతరం పబ్బతి నాగభూషణం – సునీత దంపతుల కుమార్తె పబ్బతి రోషిణి ఎంబీబీఎస్ అనంతరం హౌస్ సర్జన్ చదువు కోసం సంఘం నుంచి రూ.5 వేలను అందజేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు వీరమల్లయ్య, మల్లికార్జున్, సంపత్ కుమార్, వాసుదేవ్, శ్రీనివాస్ ఉన్నారు.

ఎన్‌సీసీతో ఉద్యోగావకాశాలు



ఖిలా వరంగల్: ఎన్‌సీసీ బీ, సీ సర్టిఫికెట్లతో కేడెట్లకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని 10 టీజీఎన్‌సీసీ బెటాలియన్ కమాండెంట్ కల్నల్ రామదురై అన్నారు. వరంగల్ స్తంభంపెల్లిలోని ఏవీఎస్ లిటిల్ జెమ్స్ పబ్లిక్ స్కూల్‌లో ఎన్‌సీసీ హవల్దార్ ముగ్బుల్ బాషా, కుమార్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ అంకతి సాగర్ పర్యవేక్షణలో ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక ప్రక్రియను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే ఎన్‌సీసీ శిక్షణ పొందాలని, శిక్షణతో స్నేహభావం, క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుందని అన్నారు. ఉపాధ్యాయులు మహేందర్, చాంద్, రహీం పాల్గొన్నారు.